నియోజకవర్గంలో ఎవరూ లేరు

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచార గడువు ముగిసిన తర్వాత అక్కడ్నుంటి కాంగ్రెస్‌కు చెందిన బయటి వ్యక్తులంతా వెళ్లిపోయారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటమి భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి, నాయకులు ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. పోలింగ్ వేళ సానుభూతి పొందేలా బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకటన చేయడం కూడా ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు.

జూబ్లీహిల్స్‌లో పోలింగ్ ప్రశాంతం

- **48.47 శాతం ఓటింగ్ నమోదు**
- **పలువురు ఎమ్మెల్యేలు, నేతలపై కేసులు నమోదు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నిక పోలింగ్ ప్రక్రియ చెదురుమొదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకుకొనసాగింది. ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది.

పోలింగ్ సరళి ఇలా..

ఉదయం 7 గంటలకు 407 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభమైంది. అయితే ఉదయం నుంచే పోలింగ్ మందకొడిగా సాగింది. కొన్నిచోట్ల వృద్ధులు, వికలాంగులు ఉత్సాహంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి రెండు గంటల్లో కేవలం 9.2 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఉదయం 11 గంటల వరకు.. పోలింగ్ శాతం కొద్దిగా పెరిగి 20.76 శాతానికి చేరుకుంది. ఈ సమయంలో పలువురు ప్రముఖులు, సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు తనికెళ్ల భరణి వంటి వారు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తదితరులు ఉదయాన్నే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలావుంటే మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ 31.94 శాతంగా నమోదవ్వగా.. 3గంటల వరకు పోలింగ్ శాతం 40.20కి చేరింది. సాయంత్రం 5 గంటల వరకు.. అంటే పోలింగ్ ముగియడానికి గంట ముందు నాటికి 47.16 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసింది. అయితే, క్యూ లైన్లలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు.

తగ్గిన ఓటింగ్ శాతం.. సాంకేతిక లోపాలు!

ఇదిలావుంటే 2023 సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఈ ఉప ఎన్నికలో పోలింగ్ శాతం కొంచెం అటుఇటుగా నమోదైంది. ఈ సారి ఓటర్లలో ఉత్సాహం కొరవడింది. షేక్‌పేట్, రహమత్‌నగర్, వెంగళ్‌రావునగర్‌లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పోలింగ్ కాసేపు ఆలస్యమైంది. శ్రీనగర్ కాలనీలోని నాగార్జున కమ్యూనిటీ హాల్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా పోలింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్ వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి సునీత, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ నాయకులు ఓటర్లను ప్రభావితం చేస్తూ, కరపత్రాలు పంచుతున్నారని సునీత ఆరోపించారు. ఇరువర్గాలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇక వెంగళ్ రావు నగర్ డివిజన్‌లోని 120వ పోలింగ్ బూత్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపైఒకరు దొంగఓట్లు వేయిస్తున్నారని ఆరోపించుకుంటూ బాహాబాహీకి దిగారు. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద కొద్దిసేపు గందరగోళం నెలకొంది. షేక్‌పేట్ డివిజన్‌లోని అపెక్స్ హైస్కూల్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు లాఠీలతో చెదరగొట్టారు. రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలోని అనేక ప్రాంతాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓటుకు రూ. 2000 నుంచి రూ. 5000 వరకు పంపిణీ చేశాయని పరస్పరం ఆరోపించుకున్నాయి. ఈసీ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మక కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించింది. దేశంలోనే తొలిసారిగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నియోజకవర్గంలో ఉన్న స్థానికేతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

అభ్యర్థుల పర్యటనలు..పరస్పర ఆరోపణలు..!

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ ఉద్రిక్తతల నడుమ ముగిసింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు డివిజన్లలో విస్తృతంగా పర్యటిస్తూ పోలింగ్ సరళిని పర్యవేక్షించగా, పలుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. డబ్బు పంపిణీ ఆరోపణలు, పరస్పర దాడులతో పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా కదిలారు. ఉదయాన్నే తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం, ఆమె నియోజకవర్గంలోని కీలక డివిజన్లైన యూసుఫ్‌గూడ, వెంగళ్ రావు నగర్, బోరబండ, రహమత్‌నగర్‌లలో పర్యటించారు. పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి, ఏజెంట్లతో మాట్లాడి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల కాంగ్రెస్ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. నవీన్‌యాదవ్ సైతం తన ఓటు వేసిన తర్వాత షేక్‌పేట్, జూబ్లీహిల్స్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. బీఆర్ఎస్ నాయకులు డబ్బు పంచి ఓటర్లను ప్రలోభపెడుతున్నారని విమర్శించారు. తన కార్యకర్తలకు ధైర్యం చెబుతూ, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. ఇక బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి సైతం పలు డివిజన్లలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తమ పార్టీ ఏజెంట్లతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు డబ్బు, మద్యంతో ఎన్నికలను ప్రభావితం చేస్తున్నాయని ఆరోపించారు. మొత్తం మీద.. అభ్యర్థుల విస్తృత పర్యటనలు, పార్టీల మధ్య ఆధిపత్య పోరు, తీవ్ర ఆరోపణలు, ఘర్షణలతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ వాడివేడిగా సాగింది.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

- రూ.123 కోట్ల బడ్జెట్ కేటాయించాం
- పారదర్శకత కోసం సైన్ బోర్డు ఏర్పాటు చేస్తున్నాం : మంత్రి వాకిటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామనీ, ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో రూ.123 కోట్లు కేటాయించామని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్సశాఖ క్రియాశీలంగా మారేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకంలో చేపల ఆహారం అమలయ్యేలా సిఎం రేవంత్ రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో వరల్డ్ ఆక్వా కల్చర్ ఇండియా-2025 కాన్ఫరెన్స్ నిర్వహించారు. మత్స్య శాఖపై రూపొందించిన పాటను మంత్రి శ్రీహరి విడుదల చేశారు. స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చరిత్రలో ముదిరాజ్ బిడ్డకు మత్స్యశాఖ మంత్రి పదవి ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. గతంలో నిర్వీర్యానికి గురైన మత్స్య శాఖను పునర్నిర్మాణం చేస్తూ ముందుకెళ్తున్నానని తెలిపారు. మత్స్యకారులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించామని చెప్పారు. గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉండటమే కాకుండా గొలుసు కట్టు చెరువులు ఒక గొప్ప వరమని, ఆ నీటి వనరులు మత్స్య సంపదకు ఎంతగానో దోహదపడుతున్నాయని వివరించారు. తెలంగాణలోని దాదాపు 26వేల నీటి వనరుల్లో చేప పిల్లల పంపిణీ చేస్తున్నామనీ, వాటిల్లో84 కోట్ల చేప పిల్లలు, పది కోట్ల రొయ్య పిల్లలను విడుదల చేస్తున్నామని తెలిపారు. చేపపిల్లల పంపిణీ సంబధించిన వివరాలు తెలియజేస్తూ చెరువు వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, తెలంగాణ ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఎన్ఎఫ్‌డిబి సిఇఒ బెహరా, సంయుక్త కార్యదర్శి నీతు కుమారి, జాయ్‌కృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఐకార్, పివిఎన్ఆర్ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జ్ఞానప్రకాష్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

బిఎస్‌సి (హానర్స్) అగ్రికల్చర్ కోర్స్‌కు నవంబర్ 14న కౌన్సిలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాసంస్థల సొసైటీ ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో బిఎస్‌సి (హానర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 14వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు ఆ సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే ముందు దరఖాస్తుదారులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం https:// www. pjtau. edu.in,https://mjptbcwreis.telangana.gov.in/ వెబ్ సైట్ సందర్శించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- సిఎస్ కె రామకృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో రానున్న రోజుల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్ విభాగం (హెచ్‌డబ్ల్యూఎస్‌అండ్ ఎస్‌బి) పని తీరుపై సమీక్ష నిర్వహించారు. మంజీర, సింగూరు, గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 పనులపై సమీక్ష చేశారు. భూసేకరణ, పైప్ లైన్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, రోడ్లు, భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హైదరాబాద్ వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, హెచ్‌ఎండిఎ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పిసిసిఎఫ్ డాక్టర్ సి. సువర్ణ, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు, మిషన్ భగీరథ ఇఎన్‌సి కృపాకర్ రెడ్డి పాల్గొన్నట్టు సమాచార పౌరసంబంధాల శాఖ తెలిపింది.

ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా 12 లక్షల ఎకరాలు

- ఏటా కొత్తగా రెండు లక్షల ఎకరాల్లో సాగు చేసే లక్ష్యంతో ముందుకు : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా 12 లక్షల ఎకరాల భూమి అందుబాటులో ఉందనీ, ప్రస్తుతం 73,696 మంది రైతులు 2.74 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఇక నుంచి ప్రతి ఏటా కొత్తగా రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు పెంచడమే లక్ష్యంగా ముందుకెళ్తామనీ, అలా చేస్తే నాలుగేండ్లలో పదిలక్షల ఎకరాలకు సాగు పెరిగి దేశంలోనే ఆయిల్ పామ్ ఉత్పతిలో తెలంగాణ తొలిస్థానంలోకి వస్తుందని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది 1.25 లక్షల ఎకరాల లక్ష్యం నిర్ధేశించగా, ఇప్పటివరకు 31,158 ఎకరాల్లో మాత్రమే సాగయ్యిందనీ, మార్చి నాటికి మిగిలిన 93,842 ఎకరాలు సాగులోకి రావాల్సి ఉందని చెప్పారు. ఆ దిశగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. గత ఐదేండ్లలో కేవలం 2.28 లక్షల ఎకరాల్లోనే సాగు కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ విస్తరణలో నిర్లక్ష్యం వహించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్కువ పురోగతి ఉన్న జిల్లాలుగా వరంగల్, నారాయణపేట, వనపర్తి, రాజన్న సిరిసిల్ల, గద్వాల్, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్‌లను గుర్తించినట్టు తెలిపారు. ఈ జిల్లాల్లో ఆయా కంపెనీలు లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి కంపెనీ కూడా తమ పరిధిలోని జిల్లాల్లో సరిపడా సిబ్బందిని నియమించుకుని రైతులతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండాలని సూచించారు. తోటల యాజమాన్యంలో నీటి వినియోగం, ఎరువుల పంపిణీ, అంతర పంటలు, కలుపు నివారణ వంటి అంశాలపై పూర్తి దృష్టి సారించాలని ఆదేశించారు. గెలల దిగుబడులు తగ్గకుండా పర్యవేక్షణ చేయడం, విజయవంతమైన రైతుల అనుభవాలను కొత్త రైతుల ప్రోత్సాహానికి వినియోగించడం అవసరమని సూచించారు. అధిక దిగుబడి ఇచ్చే మొక్కలను దిగుమతి చేసుకోవాలన్నారు. ప్రతి కంపెనీ తన లక్ష్యానికి అనుగుణంగా నర్సరీలను ఏర్పాటు చేసుకుని రైతులకు నాణ్యమైన మొక్కలను అందించాలని ఆదేశించారు. కంపెనీలు తమ పరిధిలో రైతు సలహా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రైతు వేదికల కార్యక్రమాల్లో కంపెనీ ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొని రైతులతో చర్చించాలని సూచించారు. వచ్చే ఏడాదికల్లా ప్రతి ఉమ్మడి జిల్లాలో ఒక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ స్థాపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలనీ, ఆయిల్ పామ్ విస్తరణలో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, సహకార శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల పురోగతిపై మంత్రి సమీక్షిస్తూ, త్వరలో ప్రారంభం కానున్న ఫ్యాక్టరీల వివరాలు వెల్లడించారు. రాష్ట్రాన్ని ఆయిల్ పామ్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా మార్చడం ద్వారా రైతుల ఆదాయ వనరులు పెంచడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నొక్కి చెప్పారు. సమీక్షలో ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

'బస్వాపురం' నిర్వాసితులకు ప్రభుత్వం నమ్మకద్రోహం

- చిన్న ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య
- బస్వాపురం (నృసింహ) ప్రాజెక్టును పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బస్వాపురం (నృసింహ) ప్రాజెక్ట్ నిర్వాసితులకు ప్రభుత్వాలు నమ్మకద్రోహం చేశాయని, చిన్న నీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని బస్వాపురం(నృసింహ) ప్రాజెక్టును సిపిఎం బృందం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధతో ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే చిన్న నీటి ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఎం మొదటి నుంచి డిమాండ్ చేస్తోందన్నారు. బస్వాపురం ప్రాజెక్టుకు సంబంధించిన నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ.500 కోట్లను వెంటనే కేటాయించి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. వైఎస్సార్ కాలంలో శంకుస్థాపన చేసిన బస్వాపురం ప్రాజెక్టుకు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కెపాసిటీ పెంచి మరోసారి శంకుస్థాపన చేశారన్నారు. భూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించకుండా వారికి ప్రభుత్వం నమ్మకద్రోహం చేసిందన్నారు. ప్రాజెక్టు 90శాతం పూర్తయినా రైతులకు ఒక్క పంట నీరు కూడా అందలేదని తెలిపారు. బస్వాపురం ప్రాజెక్టు పూర్తయితే మూసీ కాలుష్యచెర నుంచి ఆ ప్రాంత ప్రజలు బయటపడతారన్నారు. చోక్లాతండా రైతులకు, నిర్వాసితులకు నేటి వరకు ఒక్క రూపాయి అందలేదన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయకపోతే నిర్వాసితులతో కలిసి సమరశీల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. బస్వాపురం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం సుదీర్ఘకాలంగా అనేక దశలుగా పోరాటం చేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రూ. 30 కోట్లు మాత్రమే నిర్వాసితులకు చెల్లించిందన్నారు. కీలకమైన ప్రాజెక్టు పూర్తి చేయాలంటే నిర్వాసితులకు పూర్తిస్థాయిలో సహాయం అందించాలన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఐదు శాసనసభల నియోజకవర్గాలకు సహాయం అందుతుందన్నారు. వారు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు తేవడంలో విఫలమవుతున్నారని తెలిపారు. చోక్లా తండా నిర్వాసితుల పరిస్థితి హృదయ విధాయకరంగా ఉందన్నారు. ఇప్పటివరకు నష్టపరిహారం అందించలేదన్నారు. మూసీ ప్రక్షాళన ఆలస్యమవుతున్నందున గోదావరి జలాలతో ఈ ప్రాంతానికి విముక్తి చేయాలని కోరారు. భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టు సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేష్, మాయ కృష్ణ, పల్లెర్ల అంజయ్య, సిర్పంగ స్వామి, దయ్యాల నరసింహ, ముత్యాలు కొండమడుగు నాగమణి, కల్లూరి నాగమణి, మాటూరి కవిత, వడ్డేబోయిన వెంకటేష్, అన్నపట్ల కృష్ణ, కొండ అశోక్, మచ్చ భాస్కర్, నరాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జాతీయ భావాలు గల విద్యా వేత్త

- మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్

ప్రజాశక్తి కల్చరల్ : నెహ్రూ సమకాలికుడుగా మౌలానా కలం అజాద్ జాతీయ భావాలు కల విద్యా వేత్త అని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై తెలంగాణ ఉర్దూ అకాడమీ నిర్వహణలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా ప్రముఖ విద్యా వేత్త లతీఫ్ ఖాన్‌కు మౌలానా అబుల్ కలాం అజాద్ జాతీయ పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా అజారుద్దీన్ పాల్గొని పురస్కారం బహుకరించి మాట్లాడారు. లతీఫ్ ఖాన్ మూడు దశాబ్దాల గా విద్య, సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేశారని ప్రశంసించారు. ఉర్దూ భాష పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలకు గుర్తింపు ఈ పురస్కారం అన్నారు. అకాడమీ వైస్ చైర్మన్ నజ్రత్ ఖాన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ జాతీయ పురస్కారం గా రెండు లక్షల ఇరువై వేల నగదు జ్ఞాపిక ప్రశంస పత్రం అందజేస్తున్నామని తెలిపారు. అధికారులు అన్వర్ అహ్మద్ డాక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమైన విధులకు సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఉపయోగించాలి

- సబ్యసాచి ఘోష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని సంక్షేమ శాఖల్లో హాస్టల్ నిర్వహణ కోసం సాఫ్ట్‌వేర్‌కు ప్రాధాన్యతనివ్వాలని సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌ను రూపొందించే విషయంపై ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంక్షేమశాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల హాస్టల్ నిర్వహణలో ఉమ్మడిగా ఉండే కీలక రంగాలను గుర్తించారు. సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్లే మార్గాన్ని ఆయన వివరించారు. విద్యార్థుల సంక్షేమం, నివాసితుల సంక్షేమం, హాస్టల్ సౌకర్యాలు, ఆహార సరఫరా, వైద్య అత్యవసర పరిస్థితులు, తనిఖీలు, నివేదికలు తదితర ముఖ్యమైన విధులకు సాఫ్ట్‌వేర్ ప్రాధాన్యత ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. సిస్టమ్ ద్వారా సంగ్రహించాల్సిన విషయాలపై సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ, పర్యవేక్షణను మెరుగుపరచడమే కాకుండా మెరుగైన, మరింత ప్రభావవంతమైన పర్యవేక్షణను నిర్ధారించడానికి వివరణాత్మక కార్యాచరణ నివేదికలను అందించే అప్లికేషన్‌ను రూపొందించాలన్న ముఖ్యమంత్రి ఆదేశం మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించారు.

అందెశ్రీకి హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఘన నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ కవి అందెశ్రీకి హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ ఘన నివాళులర్పించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సంతాప సభలో... తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ విధమైన సాహితీ నేపథ్యం లేకుండానే తనలోని అపారమైన ప్రతిభతో అగ్రశ్రేణి కవుల్లో ఒకరిగా ఎదిగారని పేర్కొన్నారు. స్వరాష్ట్ర ఉద్యమానికి ఆయన రాసిన పాటలు ప్రేరణగా నిలిచాయని అన్నారు. తెలంగాణ గ్రామీణ జీవితం, యాస, సంస్కృతికి ఆయన రచనలు ప్రతీకలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర గీత రచన ద్వారా అందెశ్రీ చరిత్రలో నిలిచారన్నారు. ఆయన మృతి భవిష్యత్ తరానికి తీరని లోటని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి వాసు, వైస్ ప్రెసిడెంట్ శోభన్, ట్రెజరర్ నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న బిజెపి విధానాలు

- ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి తిరోగమన విధానాలతో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నదని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య విమర్శించారు. మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ సమావేశం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షులు శనిగారపు రజినీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భట్టాచార్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రాలపై బలవంతంగా రుద్దుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పేదలు, మధ్యతరగతి విద్యార్థులు చదువులను మధ్యలోనే ఆపేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించకుండా వాటిని మూసేసేందుకు, అంగన్‌వాడీలను ఎత్తేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. విద్యారంగంలో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా విద్యార్థి లోకాన్ని ఏకం చేసి భవిష్యత్తులో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. విద్యార్థులకు పాఠశాలల్లో అందించే మధ్యాహ్నం భోజనం రేట్లు పెంచామని బిజెపి గొప్పలు చెప్పుకుంటుందనీ, రూ.12తో కడుపునిండా భోజనం లభిస్తుందా అని ప్రశ్నించారు.



రాష్ట్రంలో విద్యారంగంపై నిర్లక్ష్యం : తాళ్ల నాగరాజు

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ విద్యాశాఖకు మంత్రిగా నియమించకుండా సిఎం రేవంత్ రెడ్డి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ వసతి గృహాలు, కెజిబివిలు, గురుకులాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయకపోవడంతో హాస్టళ్ల విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని విద్యార్థులు, కళాశాలల యజమాన్యాలు ఆందోళన చేస్తుంటే ఆ కళాశాలలపై ఎసిబి దాడులు నిర్వహించడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. గత ఆరు సంవత్సరాల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1,924 కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8,042 కోట్లు బకాయిలో ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థులు, యాజమాన్యాలు రోడ్లపైకి వస్తుంటే కాంగ్రెస్ సర్కారు నిద్రపోతుందా? అని ప్రశ్నించారు.

విద్యార్థులను విస్మరించిన ప్రభుత్వాలు బతికి బట్టకట్టలేదన్న చరిత్ర గుర్తుపెట్టుకోవాలని కోరారు. విద్యారంగ సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్షించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యులు మమత, కేంద్ర కమిటీ సభ్యులు, ఖమ్మం పాటి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు అశోక్ రెడ్డి, యార ప్రశాంత్ రెడ్డి, రంజిత్ రెడ్డి, దీపికా, భరత్, తారా సింగ్ ,ఆకారపు నరేష్, అభినవ్, లెనిన్, రాజు, సాయి, రమ్య, కుర్ర సైదా నాయక్, అభిషేక్, రాజు, రాజేష్, సయ్యద్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష పద్ధతిలో 80 శాతం జెఎఒల భర్తీ

- ఉత్తర్వులు జారీ చేసిన టిజి ట్రాన్స్‌కో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిట్రాన్స్‌కో)లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ (జెఎఒ)గా 80 శాతం నియామకాలను ప్రత్యక్ష పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ మేరకు సంస్థ ఎండి డి కృష్ణభాస్కర్ మంగళవారం జిఒ (2541) జారీ చేశారు. 2018లో చేపట్టిన మాదిరిగా ఎపిఎస్‌ఇబి సర్వీస్ రెగ్యులేషన్ యాక్ట్ నిబంధనల మేరకు ఈ ఒక్కసారి సవరించిన విధానంలో నియామకాలు చేపట్టనున్నట్టు జిఒలో పేర్కొన్నారు. ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నాటికి అందుబాటులో ఉన్న జెఎఒ ఖాళీలలో 80 శాతం ప్రత్యక్ష నియామకం ద్వారా, 20 శాతం సర్వీసులో కొనసాగుతున్న యూడీసీలను వారి అర్హతల ఆధారంగా ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయనున్నట్టు తెలిపారు.

జిఒను రద్దు చేయాలి
టిఎస్‌ఇఇ యూనియన్ డిమాండ్ (సిఐటియు)

సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులకు నష్టం కలిగించే జీవో 2541ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె ఈశ్వర్‌రావు, నలువాల స్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 80 శాతం జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లను ప్రత్యక్ష పద్ధతిలో నియమిస్తే ఏళ్ల తరబడి సర్వీస్ ఉన్న వారికి అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 4ప్లస్ వన్ విధానం ద్వారా.. సర్వీస్‌లో ఉన్నవారిలో నలుగురిని, డైరెక్ట్‌గా ఒక్కరిని జెఎఒలుగా నియమించే పాత పద్ధతిని కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సామినేని హంతకులను అరెస్టు చేయాలి

- డిజిపి శివధర్‌రెడ్డికి సిపిఎం బృందం వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తమ పార్టీ రాష్ట్ర నాయకులు సామినేని రామారావును హత్యచేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లో ఈ మేరకు డిజిపి బి శివధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసింది. డిజిపిని కలిసిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, తదితరులున్నారు. 'ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడుకి చెందిన సామినేని రామారావును అక్టోబర్ 31 తెల్లవారు జామున ఉదయం 5:30 ప్రాంతంలో వారి కొట్టంలో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ వ్యక్తులు బొర్రా ప్రసాద్, కంచుమర్తి, రామకృష్ణ, మద్దినేని నాగేశ్వర్‌రావు, కంద్రా పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లుతో పాటు మరికొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి అతి దారుణంగా నరికి చంపారు. చంపిన వారిని స్వయంగా చూశానని రామారావు భార్య స్వరాజ్యం చెప్పింది. ఆ పేర్లతో పిటిషన్ కూడా రాసి ఇచ్చింది. హత్య జరిగి 12 రోజులు పూర్తయినా ఇప్పటివరకూ నిందితులను అరెస్టు చేయలేదు. ఇది ఆందోళన కలిగించే విషయం. రామారావు నిస్వార్థ ప్రజా నాయకుడు. ఆ గ్రామంలో ఏకగ్రీవ సర్పంచ్‌గా రెండు సార్లు చేశారు. వారి సతీమణి ఒకసారి సర్పంచ్‌గా చేసింది. పేదలకు ఇండ్లు కట్టించేందుకు తమ సొంత భూమిని పంచిన చరిత్ర రామారావుది. 50 ఏండ్లుగా సిపిఎం జిల్లా, రాష్ట్ర నాయకునిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉంటూ పేదలు, రైతుల పక్షాన అనేక పోరాటాలు చేశారు. గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. రామారావు బతికి ఉంటే గ్రామంలో సిపిఎంను ఓడించడం సాధ్యం కాదనీ, తమ రాజకీయ మనుగడ సాధ్యం కాదనే కక్షతో ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుట్రపన్ని అత్యంత కిరాతకంగా హత్య చేశారు. హంతకులను, కుట్రకు పాల్పడిన వారిని అరెస్టు చేసి, చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలి' అని డిజిపికి జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ విన్నవించారు.



డిజిపి శివధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం బృందం

ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటనను ఖండిస్తున్నాం

- కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణం - సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశాన్ని దిగ్భ్రాంత్రికి గురిచేసిన ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన బాంబు పేలుడు ఘటనను సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని పేర్కొంది. మంగళవారం ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ఘటనలో 13 మంది చనిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. మృతులకు సంతాపాన్ని, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్రంలోనూ, ఢిల్లీలోనూ బిజెపి ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. కేంద్ర నిఘా సంస్థలు ఆ ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేస్తున్నాయి. ఈ ఘటన జరగడానికి కేంద్ర ప్రభుత్వం, నిఘా సంస్థల వైఫల్యమే కారణం. ఈ పేలుళ్లకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఘటనపై వెంటనే అత్యున్నత స్థాయి దర్యాప్తు చేయాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.



ఒసికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలి

- ఇంధన శాఖ ప్రిన్స్ పల్ కార్యదర్శి నవీన్‌మిట్టల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం తాడిచెర్లలోని కాపురం బ్లాక్-1 ఓపెన్‌కాస్ట్ మైన్‌కు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తెలిపారు. మంగళవారం జెన్కో సీఎండీ హరీశ్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎఎమ్మార్ సిఎండి మహేశ్వర రెడ్డి, సిఇఒ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, థర్మల్, కోల్ డైరెక్టర్లతో కలిసి తాడిచర్ల-1 కోల్ బ్లాక్ ఓపెన్‌కాస్ట్ మైన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మైనింగ్ కార్యకలాపాలు, ఉత్పత్తి ప్రక్రియ, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ చర్యలు వంటి అంశాలను వివరించారు. మైనింగ్ ప్రాంతం నుంచి తాడిచర్ల గ్రామాన్ని, వాహన ప్రాంగణం, యంత్రాలను, ఫీడర్ బ్రేకర్‌ను పరిశీలించారు. భూసేకరణకు సంబంధించిన పరిహారం పంపిణీ, పునరావాస చర్యలు వంటి విషయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎమ్మార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో భూసేకరణ, పునరావాస చర్యలు న్యాయబద్ధంగా, పారదర్శకంగా, వేగంగా పూర్తిచేయాలని నవీన్ మిట్టల్ అధికారులకు సూచించారు. అనంతరం తాడిచర్ల నుంచి కేటీపీపీ వరకు కన్వేయర్ బెల్ట్ నిర్మాణం, రవాణామార్గం, దూరాభారాలపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు కన్వేయర్ బెల్ట్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, రహదారి మార్గం, భద్రతా చర్యలు, అవసరమైన నిర్వహణ ప్రక్రియపై వివరాలు అందించారు. కన్వేయర్ బెల్ట్ నిర్మాణం పూర్తయితే రహదారి రవాణాపై భారం తగ్గి సమర్థవంతంగా బొగ్గు పంపిణీ జరుగుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా రానున్న రోజుల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరా జరగాలని ఆయన సూచించారు. కెటిపిపిలో 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో థర్మల్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, కోల్ డైరెక్టర్ రాగ్యా, విద్యుత్తు శాఖ ఈడీ లక్ష్మయ్య, కెటిపిపి సిఇ ప్రకాష్, ఎస్ఇ ముత్యాలరావు, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విద్యుత్తు శాఖ ఎస్ఈ మల్సూర్‌నాయక్, తహసీల్దార్ రవికుమార్, ఎఎంఆర్ సీనియర్ మేనేజర్ కెఎస్ఎన్ మూర్తి, జెన్కో జిఎం మోహన్‌రావు, ఎఎమ్మార్ అధికారులు, జెన్కో అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.202.93 కోట్ల విడుదల

- హౌసింగ్ కార్పొరేషన్ ఎండి విపి గౌతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లుల రూపేణా ఈ వారంలో రూ.202.90 కోట్లను విడుదల చేశారు. ఇళ్ల నిర్మాణపు పనుల దశలను బట్టి విడుదల చేయాల్సిన బిల్లు మొత్తాలను ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియలో భాగంగా నవంబరు 11న పురోగతి సాధించిన మేరకు 18,247 మంది లబ్ధిదారులకు బిల్లులను విడుదల చేసినట్టు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారం లబ్ధిదారులకు చేసిన చెల్లింపుల్లో బేస్ మెంట్ లెవల్ నిర్మాణాలు 4,615, రూఫ్ లెవల్ (గోడలు పూర్తి) అయినవి 8,517, శ్లాబ్ వేసినవి 5,115 ఇండ్లు ఉన్నాయని వివరించారు.

మొత్తం రూ.2900 కోట్ల చెల్లింపు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇప్పటి వరకు మొత్తం రూ.2,900.35 కోట్ల ను చెల్లించారు. వీటిలో బేస్ మెంట్ లెవల్ (బిఎల్) దాటిన ఇండ్లకు రూ.1,610.79 కోట్లు, రూఫ్ లెవల్ (ఆర్ఎల్) రూ.716.91 కోట్లు, రూఫ్ క్యాస్టెడ్ (శ్లాబ్ పూర్తి-ఆర్సి) అయిన ఇళ్లకు రూ.572.65 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు 2,33,069 ఇళ్ల పనులు ప్రారంభం కాగా, వాటిలో బేస్‌మెంట్ (బిఎల్) స్థాయిలో 90,613, గోడల నిర్మాణపు పూర్తి అయిన స్థాయిలో (ఆర్ ఎల్) 41,212 ఇండ్లు, శ్లాబ్ పూర్తి (ఆర్సి) అయినవి 37,400 ఇళ్లు ఉన్నాయని గౌతం తెలిపారు.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ రంగంలోకి అదానీ

న్యూఢిల్లీ : అదానీ గ్రూప్ కొత్తగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ (బిఇఎస్ఎస్) రంగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. 2026 మార్చి నాటికి 3530 మెగావాట్ అవర్ సామర్థ్యంతో ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి రానుందని పేర్కొంది. ఈ ప్లాంట్‌ను గుజరాత్‌లోని ఖవ్డాలో కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 700కు పైగా బిఇఎస్ఎస్ కంటెయినర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. బిఇఎస్ఎస్ అనేది విద్యుత్ శక్తిని రసాయనిక రూపంలో నిల్వ చేసి, అవసరమైనప్పుడు తిరిగి వాడుకోవచ్చు. ముఖ్యంగా సౌర, గాలి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి వచ్చే విద్యుత్‌ను స్థిరీకరించడానికి, గ్రిడ్‌ను సమతుల్యం చేయడానికి వీటిని వినియోగిస్తుంటారు. బ్లాక్‌అవుట్ సమయాల్లోనూ బ్యాకప్ పవర్‌గా ఇది ఉపయోగపడుతుంది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ ఇంధన రంగంలో స్వావలంబన, సుస్థిరతకు తమ గ్రూప్ మద్దతు ఇస్తోందని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీ పేర్కొన్నారు.

స్విగ్గీతో మైబిజ్ ఒప్పందం

హైదరాబాద్ : మేక్‌మైట్రిప్ తన కార్పొరేట్ బుకింగ్ వేదిక అయినా మైబిజ్ వ్యాపార ప్రయాణికుల కోసం భోజన ఖర్చుల నిర్వహణను సులభతరం చేయడానికి స్విగ్గీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ప్రయాణికులు ఇప్పుడు స్విగ్గీ యాప్‌లోని 'స్విగ్గీ ఫర్ వర్క్' ద్వారా తమ భోజనాన్ని ఆర్డర్

గ్రాన్యూల్స్ లైఫ్ సైన్సెస్‌కు తొలిసారి యుఎస్‌ఎఫ్‌డిఎ ఆమోదం



హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన అనుబంధ సంస్థ అయిన గ్రాన్యూల్స్ లైఫ్ సైన్సెస్ ప్రయివేటు లిమిటెడ్ (జిఎల్ఎస్) తన హైదరాబాద్‌లోని తయారీ కేంద్రానికి మొట్టమొదటి యుఎస్ ఎఫ్‌డిఎ ఆమోదం లభించింది. ఒక నిర్దిష్ట ఉత్పత్తికి సంబంధించిన ప్రీ-అప్రూవల్ ఇన్‌స్పెక్షన్ (ఎఫ్ఇఐ) జరిగిందని పేర్కొంది. దీంతో జిఎల్ఎస్ హైదరాబాద్ కేంద్రం ఇక అమెరికా మార్కెట్‌కు ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి యుఎస్‌ఎఫ్‌డిఎ ఆమోదం లభించినట్లయ్యింది. భద్రతా కారణాల దృష్ట్యా ఆమోదించబడిన ఉత్పత్తి వివరాలను ఆ కంపెనీ వెల్లడించలేదు. ఇది ఇప్పటికే గ్రాన్యూల్స్ గగిలాపూర్ కేంద్రంలో తయారవుతున్న ఉత్పత్తి అని, ఈ కొత్త ఆమోదంతో మార్కెట్ వాటాను పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గ్రాన్యూల్స్ ఇండియా సిఎండి డాక్టర్ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు.

గ్రామసభలు నిర్వహించిన తర్వాతే భూములు తీసుకోవాలి


- ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ట్రిబుల్‌ఆర్ బాధితుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామసభలు నిర్వహించిన తర్వాతే తమ భూములను తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలకేంద్రంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ట్రిబుల్ ఆర్ భూ బాధితులు ధర్నా నిర్వహించారు. మంగళవారం ఉదయమే పోలీసులకు ధర్నా సమాచారం అందడంతో చౌటుప్పల్ ఎసిపి పటోళ్ల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం దగ్గర బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతులు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్‌డిఒ బయటికి వచ్చి రైతులకు సమాధానం చెప్పాలని బాధితులు నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌డిఒ బయటికి వచ్చి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రిబుల్‌ఆర్ బాధితుల సంఘం నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, చింతల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించకుండా రైతుల భూములు గుంజుకోవద్దని తెలిపారు. తమను సంప్రదించకుండా అధికారులు గానీ, పోలీసులుగాని భూములపైకి వస్తే ఎంతకైనా తెగిస్తామని ఆర్‌డిఒను, పోలీసులను హెచ్చరించారు. వెంటనే చౌటుప్పల్ మండలంలో భూములు కోల్పోతున్న రైతులతో కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటుచేయాలని రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు.

ఆర్డీఓ వెల్మ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరునెలల కాలంలో మండలంలో భూములు కోల్పోతున్న రైతులతో గ్రామ సభలు నిర్వహించిన తర్వాతనే భూముల వద్దకు వస్తానని హామీ ఇచ్చారు.



అంతరాల తొలగింపు సోషలిజంతోనే సాధ్యం

- 26న 15 వేల మంది యువ కమ్యూనిస్టులతో ఖమ్మంలో జనసేవాదళ్ ర్యాలీ : ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేద, ధనిక అంతరాల తొలగింపు సోషలిస్టు వ్యవస్థతోనే సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నొక్కి చెప్పారు. ప్రజల భవిష్యత్తు, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆర్థిక న్యాయం, తదితరాలు ఆ వ్యవస్థతోనే సాధ్యమన్నారు. ఇప్పుడు యూరప్ దేశాల్లో కమ్యూనిస్టుల గాలి వీస్తోందని, అది ప్రపంచవ్యాప్తమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నేపాల్‌లోని వామపక్ష పార్టీలు ఐక్యం కావడం రానున్నది సోషలిస్టు వ్యవస్థే అని చెప్పడానికి నిదర్శనమని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జనసేవా దళ్ రాష్ట్ర సమితి కన్వీనర్ పంజాల రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. శ్రీశ్రీ చెప్పినట్టు సోషలిస్టు వ్యవస్థ కోసం నవయుగ దూతలుగా యువత దూసుకురావాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామనీ, అదే రోజు ఖమ్మంలో 15 వేల మంది యువ కమ్యూనిస్టులతో జనసేవాదళ్ ర్యాలీ చేపట్టనున్నామని ప్రకటించారు. మన దేశం కార్పొరేట్ శక్తుల ఆధీనంలోకి వెళ్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం జరగాలంటే, ఉత్పత్తి సాధనాలు ప్రజల చేతుల్లోకి రావాలన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అమలు చేయడమే కాకుండా ఆర్థిక సమానత్వం రావాలని ఆకాంక్షించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, ఎం బాలనరసింహ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వల్లివుల్లా ఖాద్రి, ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఖజానా గలగల

- నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.12.92 లక్షల కోట్లు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఖజానా కలకలలాడుతోంది. ప్రజలను పన్నుల రూపంలో పిండేస్తున్న నిధులు రికార్డులను సృష్టిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.12.92 లక్షలకు చేరాయి. ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 10 కాలంలో ఇక వ్యక్తిగత పన్ను వసూళ్లు రూ.7.19 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంలో ఈ మొత్తం రూ.6.62 లక్షల కోట్లుగా ఉంది. గతేడాదితో పోల్చితే భారీ పెరుగుదల చోటు చేసుకోవడం విశేషం. రీఫండ్‌లు తగ్గడంతో గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 7 శాతం పన్ను వసూళ్లు పెరిగాయని కేంద్ర ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. సెక్యూరిటీల లావాదేవీ పన్ను (ఎస్‌టిటి) వసూళ్ల స్వల్పంగా తగ్గి రూ.35,682 కోట్లుగా నమోదయ్యాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.25.20 లక్షల కోట్లను వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాదితో పోల్చితే ఈ మొత్తం 12.7 శాతం ఎక్కువ కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రీఫండ్ జారీలు 18 శాతం తగ్గి రూ.2.42 లక్షల కోట్లుగా చోటు చేసుకున్నాయి. ఇదే కాలంలో కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.5.37 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.5.08 లక్షల కోట్లతో పోల్చితే కార్పొరేట్ పన్ను వసూళ్లు పెరిగాయి. రిఫండ్‌లకు ముందు స్థూల పన్ను వసూళ్లు 2.15 శాతం పెరిగి రూ.15.35 లక్షల కోట్లకు చేరాయి.

మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో జిఎస్‌టి వసూళ్లు 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2017లో జిఎస్‌టిని అమలు చేసినప్పటి నుంచి ఇదే అత్యధికం కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా రూ.2.37 లక్షల కోట్లు వసూళ్లు కాగా.. ప్రతీ నెల సగటున రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు జరుగుతున్నాయి. పన్ను వసూళ్లు భారీగా నమోదవుతున్నప్పటికీ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని నిపుణులు విమర్శిస్తున్నారు.

నేడు ఎస్‌బిఐ 'డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్' మెగా క్యాంప్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రభుత్వ రంగ దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ మెగా క్యాంప్‌ను ఏర్పాటు చేస్తోన్నట్లు పేర్కొంది. నవంబర్ 12న కోటిలోని స్థానిక ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 2:00 గంటల నుండి ఇది ప్రారంభమవుతుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ, స్వయంప్రతిపత్త సంస్థల పెన్షనర్లు తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పణకు బ్యాంకు సిబ్బంది సహాయంతో సదుపాయం పొందవచ్చని ఎస్‌బిఐ తెలిపింది. ఆధార్ కార్డ్, పిపిఒ నంబర్, ఖాతా సంఖ్య, ఆధార్‌తో రిజిస్టర్ చేసిన మొబైల్ నంబర్ తీసుకురావాలని సూచించింది. ప్రక్రియను సులభంగా, వేగంగా, కాగిత రహితంగా పూర్తి చేయడానికి సహకరించాలని కోరింది.

వరద బాధిత కుటుంబాలకు రూ.12.99 కోట్ల సాయం

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తక్షణ సాయం కింద రూ.12.99 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మొంథా తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇండ్లకు రూ.15 వేల చొప్పున సాయం అందించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాల కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8,662 ఇండ్లు దెబ్బతిన్నాయని వివరించారు. వారికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు. గతనెల 27 నుంచి 30 వరకు వరుసగా నాలుగు రోజులపాటు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని వివరించారు. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు.

ట్రాక్టర్ ఆఫ్ ది ఇయర్ టాప్5లో టాఫే

హైదరాబాద్ : ట్రాక్టర్ ఆఫ్ ది ఇయర్ సస్టైనబుల్ విభాగంలో టాప్5లో నిలిచినట్లు టాఫే ట్రాక్టర్స్ తెలిపింది. టాఫే ఇవి 28 ఎలక్ట్రిక్ ట్రాక్టర్ సస్టైనబుల్ ట్రాక్టర్ విభాగంలో ట్రాక్టర్ ఆఫ్ ది ఇయర్ 2026 టాప్ 5 ఫైనలిస్ట్ అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొంది. ఇది గ్లోబల్ ఉనికిని విస్తరించడంలో భాగం కానుందని ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ లక్ష్మీ వేణు పేర్కొన్నారు. ఇటీవల తమ సంస్థ ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ టాఫే ఎవిఎక్స్ 28ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ప్రపంచంలో అత్యధిక డిమాండ్ కలిగిన సబ్-100 హార్స్‌పవర్ ట్రాక్టర్ విభాగంలో గ్లోబల్ లీడర్‌గా నిలవాలనే లక్ష్యంతో టాఫే ముందుకు సాగుతోందన్నారు.

మరింత మెరుగ్గా కోర్టెవా అగ్రిసైన్స్ 'డెలిగేట్'

హైదరాబాద్ : కోర్టెవా అగ్రిసైన్స్ తమ 'డెలిగేట్' ఇన్సెక్టిసైడ్‌ను మరింత మెరుగుదలతో ఆవిష్కరించినట్లు తెలిపింది. దేశంలోని మొక్కజొన్న, పత్తి, మిరప రైతులకు 'సమీకృత సస్యరక్షణ' విధానంలో ఇది ఒక నమ్మకమైన పరిష్కారంగా తన ఉనికిని బలోపేతం చేసుకోనుందని ఆ కంపెనీ పేర్కొంది. రైతులకు అధిక ఉత్పాదకత, పంట నష్టాన్ని తట్టుకునే శక్తిని సాధించడానికి తోడ్పడుతుందని తెలిపింది.